క్లుప్తంగా

హైదరాబాద్‌కు త్వరలో ప్రత్యేక బస్సు సర్వీసు

తుని: ప్రయాణికులకు అవసరమైన అన్ని బస్సు సర్వీసులు నడుపుతామని తుని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి వచ్చిన సూచనల మేరకు తుని నుంచి హైదరాబాద్ బీహెచ్‌సీఎల్‌కు కొత్త స్టార్ లైనర్ స్లీపర్ కోచ్ బస్ సర్వీసును అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఈ బస్సు తునిలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మురుసటి రోజు ఉదయం 6 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. హైదరాబాద్‌లో అదే రోజు సాయంత్రం 6 గంటలకు బయలు దేరి తర్వాత రోజు ఉదయం 6 గంటలకు తుని చేరుకుంటుందన్నారు. టికెట్ ధర రూ.1155గా నిర్ణయించామన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తక్కువ ధరలకు నిత్యావసరాలు

జగ్గంపేట: ప్రభుత్వం ప్రజలకు కందిపప్పు కేజీ రూ.160, సోనామసూరి డీబీటీ రకం బియ్యం కేజీ రూ.49కి అందజేస్తున్నట్లు ఎంఎస్ఓ కృష్ణ తెలిపారు. జగ్గంపేటలోని విక్టరీ బజార్ వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశామని, వీటిని ప్రజలు అక్కడ కొనుగోలు చేయవచ్చన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన స్టాల్‌ను బుధవారం స్థానిక టీడీపీ నేతలు ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ స్టాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వీరవరపుపే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వీరవరపుపేట, కొత్త సూరవరం, కొబ్బరితోట, ఇసుకలపేట, రామకృష్ణాకాలనీ, గవరపేట, ఉప్పరగూడెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని ఆయన కోరారు.

గోకవరం మండలంలో...

గోకవరం: విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఏఈ అశోక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట, గంగంపాలెం, ఠాకూరుపాలెం, సూదికొండ, జగన్నాథపురం, శివారామపట్నం, భూపతిపాలెం, మల్లవరం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా తుస్ !

ప్రత్తిపాడు: పార్లమెంట్ సమావేశాల్లో ఏపీకి ప్రత్యేక హోదా తుస్సు మనిపించారని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను అన్నారు. ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులపై కేంద్రం వివరణ ఇవ్వాలని కోరారు.

భద్రవరంలో భారీ అన్నదానం

ఏలేశ్వరం: గురుపౌర్ణమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మండలంలోని భద్రవరంలో గురువారం అన్నదానం నిర్వహించారు. సిద్ధివినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కొప్పన బాబ్జీ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు, జిగాటపు సూరిబాబు తదితరులు సాయిబాబాను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఎంపీడీఓ రమణారావు మృతికి సంతాపం



గోకవరంలో ఎంపీడీఓ రమణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

గోకవరం: నర్సాపురం ఎంపీడీఓ ఎంవీ రమణారావు మృతికి గోకవరం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సంతాపం తెలిపారు. ఎంపీడీఓ గోవిందు ఆధ్వర్యంలో రమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గత ఎన్నికల సమయంలో రమణారావు గోకవరం ఎంపీడీఓగా అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కార్యాలయం ఏఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, పీఆర్ జేఈ అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ షాన్ మోహన్
- పలు గ్రామాల్లో పర్యటన



రేఖవానిపాలెంలో వాటర్ క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్



తుని ఆసుపత్రిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ షాన్ మోహన్

తుని రూరల్: గ్రామాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. మండలంలోని రేఖవానిపాలెం, మరువాడ, డి.పోలవరం గ్రామాల్లో గురువారం కలెక్టర్ పర్యటించారు. డి.పోలవరంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడాన్ని గుర్తించి, సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కిలో మీటరు దూరంలో బోరుబావి ఉండడం వల్ల తరుచూ తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోందని, కాలువ లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండిపోతున్నట్టు సిబ్బంది వివరించారు. ఆర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించడంతో పాటు కొత్తగా బోరుబావి, కాలువ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. రేఖవానిపాలెంలో తాగునీటి క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇన్‌లైన్ క్లోరినేషన్ పద్ధతి అమలు చేస్తామన్నారు. మరువాడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతుందా ? లేదా ? అని గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మామిడి మొక్క నాటారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ ప్రవీణ, సీడీపీఓ శ్రీలత, తహసీల్దార్ భరత్‌రెడ్డి, ఎంపీడీఓ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎ.శివాజీ, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధికారులు పాల్గొన్నారు.

ఏవీ నగరం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్

తొండంగి: నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్)కు అర్హత సాధించిన ఏవీ నగరం పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ గురువారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆపరేషన్ థియేటర్, ఇతర సౌకర్యాలతో పాటు పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రి నిర్వహణ, ఎన్‌క్యూఏఎస్ అర్హత సాధించడంపై ఆస్పత్రి వైద్యాధికారి పి.రవికుమార్, వైద్యురాలు భారతి, ఇతర సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి నరసింహనాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సరిత, పీహెచ్‌సీల వైద్యాధికారులు ఉన్నారు.

తొండంగి జెడ్పీ హైస్కూల్ తనిఖీ

తొండంగి జెడ్పీ హైస్కూల్‌ను గురువారం జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ పరిశీలించారు. పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారని తెలపడంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డీవైఈఓను ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. డిజిటల్ విద్యాబోధనపై ఆరా తీశారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో మాట్లాడి విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జి.ముసలయ్యపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు తయారీపై శానిటరీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్లు సరఫరా చేయాల్సి ఉందని పంచాయతీ అధికారులు వివరించారు. అన్ని ప్రాంతాల్లోనూ సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. ఆయన వెంట వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అపారిశుధ్యంపై ఆగ్రహం

తుని: ఏరియా ఆసుపత్రిలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై కలెక్టర్ షాన్ మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం ఆయన పరిశీలించారు. ప్రసూతి, అత్యవసర విభాగం, మహిళలు, పురుషుల వార్డులు, ఏఆర్టీ, ట్రామాకేర్, పిడియాట్రిక్, మరుగు దొడ్లు, శ్లాబు లీకేజ్ తదితర వాటిని పరిశీలించారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మరుగు దొడ్ల నిర్వహణ బాగా లేకపోవడంపై శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రామాకేర్ సెంటర్లో శ్లాబు ఊడిపోయిన విషయంపై సూపరింటిండెంట్ స్వప్నను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని శుభ్రపరచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం రాజా రాజబాబు మున్సిపల్ పార్కులోని అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

కామినీడువారి గ్రోయిన్ పరిశీలన

కోటనందూరు: గ్రామంలో తాండవనదిపై ఉన్న కామినీడు వారి గ్రోయిన్‌ను జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ గురువారం పరిశీలించారు. రైతుల పంట పొలాలకు నీటిని మళ్లించే ఈ గ్రోయిన్ శిథిలమవ్వడానికి కారణాలు, ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు నీరందించాలంటే తీసుకోవాల్సిన చర్యలపై రైతులతో చర్చించారు. శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బొద్దవరంలో ఉపాధి హామీ పథకంలో చేస్తున్న కొబ్బరిసాగును పరిశీలించారు. పంట వివరాలు, ప్రభుత్వం నుంచి అందుతున్న సాయంపై రైతులతో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.విజయ్‌కుమార్‌రాజు, ఎంపీడీఓ జయమాధవి, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్, ఏఓ చంద్రశేఖర్, ఏపీఎం సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



రామకృష్ణాపురంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థి కుశరాజు

రౌతులపూడి: మండలంలోని ఎం.కొత్తూరు శివారు రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం పుస్తకాలు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వానపల్లి కుశరాజు సొంత ఖర్చులతో పుస్తకాలు, స్టేషనరీ కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేశారు. తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సాయంగా 2012 నుంచి ఏటా పుస్తకాలు అందజేస్తున్నట్టు దాత కుశరాజు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు పసగడుగుల నాగేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జి.శివాజీ, వై.రాజబాబు, వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో చోరీ

శంఖవరం: స్థానిక వైఎస్సార్ అగ్రి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై మండల వ్యవసాయాధికారి పి.గాంధీ గురువారం అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ అగ్రి ల్యాబ్‌లో 9 ఫ్యాన్లు, 3 ట్యూబ్‌లైట్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు అన్నవరం ఎస్సై వి.కిశోర్ తెలిపారు. దుండగులు ల్యాబ్ తలుపులు బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తాండవ నీటి విడుదలపై నేడు సమావేశం



తాండవ జలాశయం

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు నీటి విడుదలపై శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ పి.అనురాధ గురువారం తెలిపారు. నాతవరం సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఆయకట్టు రైతులంతా విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

సమస్యలపై చర్చించి తీర్మాణం చేయాలి

తాండవ జలాశయాన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యలపై చర్చించి తీర్మాణం చేస్తే తమకు మేలు ఆయకట్టు రైతులకు మేలు జరగనుంది. జలాశయం పరిధిలో 24 మంది లష్కర్లు, 8 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్క లష్కరు కూడా లేకపోగా కేవలం ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. సిబ్బంది కొరత వల్ల కాలువలు ఆక్రమణలకు గురి కావడంతో పాటు శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిస్తే నీటి పంపిణీ సక్రమంగా జరిగే అవకాశం ఉంటుంది. కాలువల్లో పూడిక తీత, గేట్ల మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఐదు సెక్షన్ కార్యాలయాలకు పక్కా భవనాలున్నా వాచ్‌మెన్లు లేరు. దీంతో కార్యాలయాలు ఆక్రమణలకు గురికావడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



ఎస్.అగ్రహారంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, అధికారులు

రౌతులపూడి: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి అన్నారు. బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఎస్.అగ్రహారం, లచ్చిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల సంరక్షణను తల్లిదండ్రులతో పాటు సమాజం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆడపిల్లల అక్రమ రవాణా, బాల కార్మికులతో వెట్టిచాకిరి చేయించడం చట్ట రీత్యా నేరమన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు టీఎస్ మురళీకృష్ణ, వి.శేషుకుమార్, ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి పి.జానకీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

కిర్లంపూడి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎం.పూర్ణిమ కోరారు. మండలంలోని సోమవరం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మహిళా హక్కులు, బాలల సంరక్షణ చట్టాలపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారత, బాలికల రక్షణ, భారత న్యాయసంహిత చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు యడల రాంబాబు, జి.నాగభూషణం, ఎం.వెంకటేశ్వరరావు, సారా ప్రభాకరరావు, సూపర్‌వైజర్ కరిమున్నీషా తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



గోకవరంలో వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శిస్తున్న వైద్య శాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం

గోకవరం: స్థానిక సచివాలయం-4 పరిధిలోని హెల్త్, వెల్‌నెస్ కేంద్రాన్ని గురువారం వైద్యశాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నాలకు అందుతున్న టీకాలు, ఇతర వైద్య సేవల రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. వైద్య శాఖ యాప్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎస్ వసంత రాజ్యలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ, ఆశా నోడల్ ఆఫీసర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ ఆర్‌అండ్ఆర్ కాలనీలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్సై కె.నాగరాజు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... ఆర్‌అండ్ఆర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్నారని అందిన ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.15,320, రెండు సెట్లు కార్డులు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

పాఠశాల విద్యలో సమస్యలు పరిష్కరించాలి



గోకవరంలో ఎంఈఓలకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గోకవరం: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈఓలు బి.గౌరమ్మ, చిమ్మరాజుదొరలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీంతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం సడలిపోతోందన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే మేల్కొని సమస్యలను పరిష్కరించి విద్యారంగాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నారాయణరావు, పి.దుర్గాప్రసాద్, విశ్వనాథం, సుబ్రహ్మణ్యం, బాలుదొర, పావని, రాజరాజేశ్వరి, అన్నపూర్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు.

నూతన ప్రజాస్వామిక విప్లవానికి ఉద్యమించాలి



జగ్గంపేటలో రాజారావు స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా

జగ్గంపేట: నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం పీడిత ప్రజలు ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్యా పిలుపు నిచ్చారు. స్థానిక స్టాలిన్ భవన్‌లో సీపీఐ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి రాజారావు వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజారావు చేసిన పోరాటాలు, ఆయన సాధించిన విజయాలను స్మరించుకున్నారు. న్యూడెమోక్రసీ పెద్దాపురం డివిజన్ కార్యదర్శి చిట్టిబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ సంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వి.భీమశంకరం, మహిళా సంఘం నాయకులు వి.శాంతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ప్రత్తిపాడులో గురువారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం ... ఎన్‌హెచ్‌పై రాజమహేంద్రవరం వైపు పోలవరం కాలువ వద్ద సుమారు 60 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం రాత్రి రహదారి గుండా వెళ్లే వాహన చోదకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి శరీరంపై నిక్కరు, షర్టు ఉంది. మృతదేహాన్ని శవపరీక్ష కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి



గండేపల్లిలో బ్యాంక్ మేనేజర్‌కు కౌలు రైతుల వివరాలు అందజేస్తున్న ఏఓ సద్గురుమూర్తి

గండేపల్లి: కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి బ్యాంక్ అధికారులను కోరారు. మండలంలోని మురారి బ్యాంక్ ఆఫ్ బరోడా, గండేపల్లి ఎస్‌బీఐ, జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచుల మేనేజర్లను ఆయన గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలు రైతులకు విరివిగా పంట రుణాలు అందజేసి వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కౌలు రైతుల వివరాలను బ్యాంక్ అధికారులకు అందజేశారు. ఆయన వెంట గ్రామ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు ఉదయ్, సాయికిరణ్, జాన్ ఉన్నారు.

శుభ్రత.. ఆరోగ్య భద్రత



తునిలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

- గ్రామాల్లో ఉత్సాహంగా స్వచ్ఛత వారోత్సవాలు
- పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన



పేరవరంలో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

ఏలేశ్వరం: మండలంలోని పేరవరంలో గురువారం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా మండల ప్రత్యేకాధికారి ఎ.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాలు మీదుగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు. అనంతరం తిరుమాలి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.శ్రీనివాస్, మండల విస్తరణాధికారి జేవీ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

రౌతులపూడి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేకాధికారి కె.పెద్దిరాజు సూచించారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం రౌతులపూడిలో ఎంపీడీఓ ఎం.ప్రేమ్ సాగర్‌తో కలసి ఆయన పర్యటించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం స్థానిక మార్కెట్ సెంటర్‌లో కూరగాయలు, కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధించాలని సూచించారు. గ్రామాల్లో ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలను తొలగించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. గ్రామాల్లో ఫెక్సీలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత

తుని: ప్లాస్టిక్ నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటరావు పిలుపునిచ్చారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక 7, 8 వార్డుల్లో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణాలకు వెళ్లి తక్కువ మైక్రాన్లు గల ప్లాస్టిక్ సంచులను వాడకూడదని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకారం అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయుకే ఇన్‌చార్జ్ ఉప కులపతి మురళీ కృష్ణ

గండేపల్లి: విద్యాభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం అవసరమని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ ఉపకులపతి కేవీఎస్‌జీ మురళి కృష్ణ, ఆదిత్య యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదిత్యలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ ఉపకులపతి మురళి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు తల్లిదండ్రులు, అధ్యాపకులు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ డోలా సంజయ్, ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, టెక్నికల్ హబ్ సీఈఓ బాబ్జి నీలం తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తం



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న సెట్రాజ్ సీఈఓ, ట్రైనర్, ఉపాధ్యాయులు

కరప: ప్రేమ పేరుతో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కిడ్నాప్‌ల వంటి ఉదంతాలు జరుగుతున్న నేపథ్యంలో అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సెట్రాజ్ సీఈఓ ఏవీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో చదువుపైనే ఏకాగ్రతతో ఉండాలని సూచించారు. అమ్మాయిల అక్రమ రవాణా ఎలాజరుగున్నదీ, వాటి పర్యవసనాలు వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్రైనర్ రమ్యసుధ మాట్లాడుతూ బాలికలకు బ్యాడ్, గుడ్‌టచ్ గురించి అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, పి.అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.